క్లుప్తంగా

వేంకటేశ్వరాలయంలో అన్నసమారాధన



అన్నప్రసాదం వడ్డిస్తున్న నిర్వాహకులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీ కొండపై వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల నేతృత్వంలో దయాళ్‌నగర్ వాస్తవ్యులు కోవగాన దుర్గారావు, ఆదిలక్ష్మి, కోవగాన రాంబాబు, రూప, జమ్ము రాము, శారద దంపతులు, ఉరుకూటి అచ్చిబాబు ఆర్థిక సహకారంతో నారాయణ సేవ జరిపించారు. 76వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దొడ్డి రమణ, నాయకులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



మజ్జిగను పంపిణీ చేస్తున్న కేఎన్ఆర్ తదితరులు

గాజువాక : వుడా డబుల్ రోడ్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయం ఎదురుగా రాఘవరెడ్డి హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా క్రమం తప్పకుండా మజ్జిగ చలివేంద్రాన్ని నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధి సురేష్ రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు జాగరపు శ్రీను, భువనేశ్వరి, గూటూరు శంకరరావు, రాజశేఖర్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిరువీధి ఉత్సవం



తిరువీధి ఉత్సవంలో దేవేరులతో శ్రీవారు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ సినీ వరల్డ్ ప్రాంగణంలో బాలాజీ ఆలయ నిర్మాణంలో భాగంగా శనివారం తిరువీధి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి, సమేత వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను ఎస్టీబీఎల్ ప్రాజెక్ట్స్ అధినేత గుత్తికొండ బాలాజీ ఆధ్వర్యంలో సిబ్బంది, మాలధారులు ఊరేగించారు. హరిజన జగ్గయ్యపాలెం, వెంకటేశ్వర కాలనీ, షీలానగర్, జగ్గయ్యపాలెం ప్రాంతాల్లో తిరువీధి సాగింది. కార్యక్రమంలో ఎస్టీబీఎల్ జీఎం కృష్ణయ్య, గాంధీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'పార్లమెంట్ భవనాన్ని రాష్ట్రపతి ప్రారంభించాలి'

ఉక్కునగరం: నూతన పార్లమెంట్ భవనాన్ని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రారంభించాలని స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. అసోసియేషన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో నాయకులు మాట్లాడారు. ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఆదివాసి సమూహానికి చెందిన మహిళను రాష్ట్రపతిగా చేశామని గొప్పలు చెప్పుకొని, బీజేపీ గత పార్లమెంట్ ఎన్నికల్లో ఆదివాసీలను నమ్మించి 47 పార్లమెంట్ స్థానాల్లో 42 స్థానాలను కైవసం చేసుకుందన్నారు. అధికారంలోకి వచ్చిన వీరు ఆదివాసులకు రక్షణగా ఉన్న అటవీ హక్కుల చట్టానికి సవరణ తీసుకువచ్చి, ఆదివాసుల నడ్డి విరిచారన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం అతి ముఖ్యమైన రాష్ట్రపతి కాకుండా ప్రధాని చేతుల మీదుగా పార్లమెంట్ భవనం ప్రారంభించాలని ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బి.తౌడన్న, ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, మోహన్‌బాబు, డి. పుల్లారావు, ఎస్. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువ కార్మికుల వేతన వెతలు

- స్టీల్‌ప్లాంట్‌లో నూతన వేతనాల అమలులో తీవ్ర జాప్యం
- కార్మిక సంఘాలపై ఒత్తిడి
- 30 మంది కార్మికుల రాజీనామా



నూతన వేతనాల అమలు కోసం ధర్నా చేస్తున్న యువ కార్మికులు (ఫైల్)

ఉక్కునగరం: ప్రభుత్వ రంగ సంస్థలో ఉద్యోగం వస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని భావించిన యువకులు కష్టపడి చదివి, జాతీయ స్థాయి పరీక్ష పాసయ్యారు. స్టీల్‌ప్లాంట్‌లో జూనియర్ ట్రైనీగా చేరినా, వేతనాలు అంతంతమాత్రంగా ఉండడంతో ఈ యువ కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. డిప్లమో అర్హతతో కూడిన ఈ ఉద్యోగాల్లో 90 శాతం మందికి పైగా ఇంజినీరింగ్ పాస్ అయిన వాళ్లే ఉన్నారు. సెయిల్‌లో నూతన వేతనాలు అమలు జరిగినా.. అదే ఒప్పందం ద్వారా రావాల్సిన నూతన వేతనాలు అమలు కాకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నామంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ విస్తరణ అవసరాలకు అనుగుణంగా 2007 నుంచి 2018 వరకు సిబ్బంది నియామకాలు చేపట్టారు. ఇందులో భాగంగా సుమారు 3,300 మంది యువ కార్మికులు ఉద్యోగాల్లో చేరారు. 2017 నుంచి ఉక్కు కార్మికులకు నూతన వేతన ఒప్పందం అమలు కావాల్సి ఉంది. సెయిల్‌లో డిసెంబర్ 2021 నుంచి నూతన వేతనాలు అమలు కాగా స్టీల్‌ప్లాంట్ కార్మికులకు ఇప్పటికీ అమలు కాలేదు. దీంతో కార్మికులందరూ ప్రతీ నెల కనీసం రూ. 10 వేల నుంచి రూ. 15 వేలు వరకు నష్టపోతున్నారు. ముఖ్యంగా యువ కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సెయిల్‌లో ఎస్–4 గ్రేడ్‌లో ఉన్న కార్మికుడి స్థూల వేతనం రూ.58 వేలు ఉండగా స్టీల్‌ప్లాంట్‌లో అదే గ్రేడ్ కార్మికుడికి రూ. 46 వేలు ఉంది. దీనికి తోడు ఎల్‌టీసీ, ఎల్ఎల్‌టీసీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, హెచ్‌బీఏలు లేకపోవడంతో నిరాశలో ఉన్నారు. ఉక్కునగరంలోని డీపాల్ పాఠశాలలో తమ పిల్లలను చదివించలేక కొద్దిపాటి ఫీజులు ఉండే డీఏవీ పాఠశాలలోకి 22 మంది ఉద్యోగులు తమ పిల్లలను మార్పించిన విషయాన్ని గుర్తింపు సంఘం నాయకుడు బహిరంగంగా చెప్పిన సంఘటన ఇందుకు ఉదాహరణగా నిలుస్తుంది.

ఈ పరిస్థితులను చూసిన 30 మంది యువ కార్మికులు ఇక్కడ భవిష్యత్తు లేదని భావించి ఇటీవల జరిగిన డీఆర్‌డీవో పరీక్షలు రాసి, సెలెక్ట్ అయ్యారు. వారు స్టీల్‌ప్లాంట్‌కు రాజీనామా చేసినట్లు సమాచారం. 8వ తరగతి, 10వ తరగతి విద్యార్హత కలిగిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు రూ. 18 వేలు తక్కువగా కాకుండా బేసిక్ లభిస్తుండగా, డిప్లమో విద్యార్హత కలిగిన ఈ ఉద్యోగికి స్టీల్‌ప్లాంట్‌లో రూ.16,800 బేసిక్ లభిస్తుండటంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2017 జనవరి 1 నుంచి అమలు కావాల్సిన నూతన వేతనాల కోసం ఆశగా ఎదురు చూస్తూ కార్మిక సంఘాలపై ఒత్తిడి తెస్తున్నారు. అయితే కార్మిక సంఘాలు క్లాజ్‌లు, ఇబ్బందులు అంటూ ఒకరిపై ఒకరు విమర్శించుకుంటూ, నూతన వేతనాలను గాలికి వదిలేస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భవిష్యత్తు భయంగా ఉంది



ప్రస్తుత ప్రైవేటీకరణ తరుణంలో వేతన ఒప్పందం జరగకపోవడంతో భవిష్యత్తు భయంగా ఉంది. వేతన ఒప్పందం జరగకుండా ప్రైవేటీకరణ జరిగితే ప్రస్తుతం ఉన్న జీతాలనే పరిగణనలోకి తీసుకునే పరిస్థితి ఉంది. అలా అయితే చాలా ఏళ్లు సర్వీసు ఉన్న మా పరిస్థితి ఏంటి? కార్మిక సంఘాలు దృష్టి సారించాలి.

– ఎస్.దిలీప్ కుమార్, ఇంజినీరింగ్ షాప్స్ కార్మికుడు

పార్ట్‌టైమ్ జాబ్ చేస్తున్నారు



వచ్చిన జీతంలో 60 నుంచి 70 శాతం పిల్లల స్కూల్ ఫీజులకే సరిపోతున్నాయి. తల్లిదండ్రుల వైద్యం, ఇతర ఖర్చులకు జీతం అసలు సరిపోవటం లేదు. ఇంటి నిర్వహణ కోసం చాలా మంది కార్మికులు స్విగ్గి, జమోటా, టాక్సీ, ఆటో డ్రైవర్లుగా అదనపు ఆదాయం కోసం పని చేస్తున్నారు.

– జి.మోహన్‌కుమార్, మెడికల్ విభాగం కార్మికుడు

ఇంకా పాత వేతనాలే..



డిప్లమో చదువుకుని పోటీ పరీక్షలలో పాసై ఎన్నో ఆశలతో స్టీల్‌ప్లాంట్‌లో చేరాం. మాతో పాటు సెయిల్‌లో చేరిన కార్మికులకు వేతన ఒప్పందం జరిగి అధిక వేతనాలు లభిస్తుండగా మేము మాత్రం పాత వేతనాలే అందుకుంటున్నాం. ఏడేళ్ల క్రితం నుంచి అమలు చేయాల్సిన వేతన ఒప్పందం చేయకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. ఎన్‌జేసీఎస్ ఒప్పందం అమలుకు యాజమాన్యం ముందుకు రావడం లేదు. కార్మిక సంఘాలు దీనిపై సమష్టిగా ప్రయత్నించడం లేదు.

– ఎస్. దుష్యంత్, బ్లాస్ట్‌ఫర్నేస్ కార్మికుడు

అమ్మ పూజ కోసం మాలధారణ

- 29 నుంచి అమ్మవార్ల ఆలయ ప్రతిష్టాపనోత్సవాలు
- దీక్ష తీసుకున్న 120 మంది భక్తులు



అమ్మవార్ల మాలధారులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కుంచాలమ్మ, దుర్గాలమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల ఆలయ ప్రతిష్టాపనోత్సవాల్లో భాగంగా పలువురు భక్తులు శనివారం అమ్మవారి మాలలను ధరించారు. 120 మంది భక్తులు మాలధారణ చేసి, ఐదురోజుల పాటు నియమనిష్టలతో అమ్మవారి పూజల్లో పాల్గొంటారని గ్రామ కమిటీ పెద్దలు తెలిపారు. ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు విశేష పూజలు, హోమాలు, అభిషేకాలతో ప్రతిష్టాపనోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలియజేశారు.

వాటర్ సప్లై పంప్ ఆపరేటర్ సస్పెన్షన్

ఫిట్టర్‌కు మెమో జారీ చేసిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



ఓహెచ్‌టీ మ్యాన్‌హోల్‌పై గోడ నిర్మిస్తున్న దృశ్యం

గాజువాక : జీవీఎంసీ 70వ వార్డు వాటర్ సప్లై విభాగంలో పంప్ ఆపరేటర్‌గా పని చేస్తున్న చంద్రమౌళిని ఆ విభాగం అధికారులు శనివారం సస్పెండ్ చేశారు. ఇదే విభాగానికి చెందిన ఫిట్టర్ అప్పారావుకు మెమో జారీ చేశారు. ఈ వార్డులోని డ్రైవర్స్ కాలనీ వద్దగల ఓవర్ హెడ్ ట్యాంక్‌లో కుక్క పడి మృతి చెందిన విషయాన్ని సాక్షి వెలుగులోకి తేవడంతో పాటు నిర్వహణపై నిర్లక్ష్యం పేరిట ఓహెచ్‌టీల పరిస్థితిపై కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఉన్నతాధికారులు స్పందించారు. వాటర్ సప్లై ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మాధవరావు, సహాయ ఇంజినీరు కేదార్‌నాథ్ తదితరులు కార్పొరేటర్ ఉరుకూటి చందుతో కలిసి సంబంధిత ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను శనివారం పరిశీలించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ పంప్ ఆపరేటర్‌ను సస్పెండ్ చేసి, ఫిట్టర్‌కు మెమో జారీ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా డ్రైవర్స్ కాలనీ ఓవర్ హెడ్ ట్యాంక్ మ్యాన్‌హోల్ ఒక గోడ నిర్మాణాన్ని హుటాహుటిన ప్రారంభించారు. ఐరన్ గ్రిల్‌తో రక్షణ ఏర్పాటు చేశారు.

పర్యావరణంపై అవగాహన అవసరం



జూపార్కులో ఆంగ్ల పదం లైఫ్ ఆకారంలో విద్యార్థులు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో కొద్ది రోజులుగా లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. విద్యార్థులు, సందర్శకులకు పర్యావరణంపై జూ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం జరిగిన కార్యక్రమంలో నగరంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. వారిచే ఆంగ్ల పదం లైఫ్ ఆకారంలో నిలబెట్టి ప్రదర్శించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ నందనీ సలారియా మాట్లాడుతూ పర్యావరణంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమం వల్ల విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన కలుగుతోందన్నారు. ఇందులో భాగంగా జూలో చిరుధాన్యాల వినియోగంపై అవగాహన, సీతాకోకచిలుకల సంరక్షణ తదితర వాటి గురించి విద్యార్థులకు, సందర్శకులకు ఆమె వివరించారు.

మన చేతల్లోనే సంతోషం



ప్రసంగిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: సంతోషం మనిషి చేతల్లోనే ఉంటుందని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. సైకాలజీ విభాగంలో 'హ్యూమన్ హ్యాపీనెస్(కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ)' అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమస్య ఉత్పన్నమైనపుడు చికిత్స చేయడం కంటే.. అది ఎదురవకుండా చూడటం ప్రధానమన్నారు. ఈ దిశగా పాఠశాల స్థాయి నుంచి చిన్నారులను సిద్ధం చేయాలన్నారు. మానసిక నిపుణులు దీనికి అవసరమైన శిక్షణ అధ్యాపకులు అందించాలని సూచించారు. తద్వారా మంచి పౌరులను తీర్చిదిద్దడం, మానవ ఆనందం, ఆరోగ్యం సంరక్షించడం సాధ్యపడుతుందన్నారు.

సదస్సు కన్వీనర్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ ఒత్తిడి కారణంగా రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులు పెరిగిపోతున్నాయన్నారు. మంచి మానవ సంబంధాలను కలిగి ఉండటం ఎంతో ప్రధానమన్నారు. కొన్ని రకాల రోగాలకు వైద్యంతో పాటు కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ అందిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు.

సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ మానసిక సమస్యలను దూరం చేయడానికి యోగా ఒక సాధనంగా పనిచేస్తుందన్నారు. ఎస్ఆర్ఐ మెడికల్ కళాశాల విభాగాధిపతి డాక్టర్ సి.రాధాకాంత్ మాట్లాడుతూ నేడు టెలీ సైక్రియార్టీ అందుబాటులోకి వచ్చిందన్నారు. ఆలోచనలు, మనస్సు, ప్రవర్తన సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామిరెడ్డి తదితరులు ప్రసంగించారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

యారాడ బీచ్‌లో క్లీన్ డ్రైవ్



బీచ్‌లో సేకరించిన వ్యర్థాలను తరలించేందుకు సిద్ధంగా ఉంచిన నేవీ సిబ్బంది

సింధియా: స్వచ్ఛమైన నీటి వనరులే లక్ష్యంగా ప్రారంభమైన పునీత్ సాగర్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం యారాడ బీచ్ క్లీన్ డ్రైవ్ నిర్వహించారు. ఇండియన్ కోస్ట్ షిప్ సముద్ర పెహ్రేదార్ అధికారులు, నావికులు, వారి కుటుంబ సభ్యులు మొత్తం 150 మంది ఈ బీచ్ క్లీన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. సముద్రతీర ప్రాంతాలను ప్రభావితం చేసే ప్రమాదకరమైన కాలుష్య కారకాలను నియంత్రించడమే లక్ష్యంగా ఐసీజీ సిబ్బంది నిర్వహించిన కార్యక్రమంలో బీచ్‌ను సందర్శించడానికి పర్యాటకులు సైతం చురుగ్గా పాల్గొని ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేశారు.

గురుకుల జూనియర్ కళాశాల ప్రవేశ పరీక్ష నేడు

పరవాడ: తానాం మహాత్మాజ్యోతి బాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ మీసాల అప్పలనాయుడు చెప్పారు. ఎంట్రన్స్ పరీక్షకు హాజరుకానున్న విద్యార్థులు వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకొన్న హాల్‌టికెట్‌ను వెంట తీసుకురావాలని చెప్పారు. పరీక్షా కేంద్రానికి గంట ముందు రావాలని పేర్కొన్నారు. పరీక్ష 495 మంది విద్యార్థులు రాయనున్నారు. హాల్ టికెట్ పొందడానికి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసిన సమయంలో కోడ్ చేసిన ఆధార్, మొబైల్ నెంబరు, ఐడీ నెంబర్లను ఎంటర్ చేస్తే హాల్‌టికెట్ డౌన్‌లోడ్ అవుతుందని ప్రిన్సిపాల్ అప్పలనాయుడు చెప్పారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

ఉక్కునగరం క్లబ్ పాలకవర్గం ఎన్నిక



నూతన కార్యదర్శి రవిరంజన్‌కు పత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి జె.వి.రావు

ఉక్కునగరం: ఉక్కు అధికారుల మానసిక ఉల్లాస కేంద్రం ఉక్కునగరం క్లబ్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. ప్రస్తుత పాలకవర్గం కాలపరిమితి ముగియడంతో నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ ఎం.ఎం డీజీఎం జె.వి.రావు రిటర్నింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. నామినేషన్ల ఘట్టం ముగిసేసరికి కమిటీ సంయుక్త కార్యదర్శిగా డి. రమేష్ (ట్రాఫిక్), కోశాధికారిగా ఎన్. తాతారావు (సీఆర్‌జీ), గ్రూప్–1 కార్యవర్గ సభ్యులుగా పి.వి.ఆర్. కిషోర్, డి. మురళీమోహన్, అభిజిత్ కుమార్, మహేంద్ర సింగ్ రావత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిని, గ్రూప్–2 నుంచి ముగ్గురు సభ్యుల ఎన్నికకు సంబంధించి, ఎన్నికలు నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు, సాయంత్రం 5.30 నుంచి 8.30 వరకు పోలింగ్ నిర్వహించారు. మొత్తం 1685 ఓట్లకుగాను, 865 ఓట్లు పోల్ అయ్యాయి. రాత్రి 9గంటలు దాటిన తర్వాత కౌంటింగ్ ప్రారంభించారు. కార్యదర్శిగా ఆర్.ఎం.హెచ్.పి ఏజీఎం రవిరంజన్ 374 ఓట్లు సాధించి, తమ సమీప అభ్యర్థి కె.ఎస్. రామాంజనేయులుపై 36 ఓట్ల తేడాతో గెలుపొందారు. అనంతరం విజేతలకు రిటర్నింగ్ అధికారి జె.వి.రావు అధికారిక ధ్రువీకరణ పత్రం అందజేశారు.

కైలాస భూమి రక్షణకు చర్యలు

రూ.30లక్షలతో ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అగనంపూడి: నియోజకవర్గం పరిధిలోని శ్మశానవాటికల్లో మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు కేటాయించనున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 85వ వార్డు తలారివానిపాలెం (దిబ్బపాలెం) శ్మశానవాటికలో రూ.30లక్షలతో నిర్మించనున్న ప్రహరీ నిర్మాణ పనులకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్మశానం చుట్టూ ప్రహరీ నిర్మించడంతో పాటు ఆవరణను చదును చేసి దహన సంస్కారాలకు అనువుగా తయారు చేయడం, వర్షాకాలంలో ఇబ్బంది లేకుండా ఉండేలా షెడ్లు నిర్మించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఏడాదిలో పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు ఇల్లపు వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు నక్కా రమణబాబు, యలమంచిలి అప్పారావు, ఇల్లపు కొండలరావు, యలమంచిలి కృష్ణప్రసాద్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

తొలి ప్రధానికి ఘన నివాళి



నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గాజువాక : భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూకు గాజువాక ప్రాంత కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం నివాళులర్పించారు. నెహ్రూ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు కాంగ్రెస్ పార్టీ గాజువాక సమన్వయకర్త జెర్రిపోతుల ముత్యాలు మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించడానికి పంచవర్ష ప్రణాళికలను అమలు చేసిన మహా నాయకుడు నెహ్రూ అని పేర్కొన్నారు. దేశంలో భారీ పరిశ్రమలను ఏర్పాటు చేశారని, భారీ నీటి ప్రాజెక్టులను నిర్మించారని, దేశ అభివృద్ధికి ఆయన పునాదులు వేశారని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వరంగం ప్రమాదంలో ఉందని, ఆ సంస్థలను కాపాడుకోవడం కోసం దేశ ప్రజలు కంకణం కట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గుడివాడ శ్రీనివాసరావు, యరబాల భూలోక, ఎం.వర్మ, చక్రధరరావు, కె.అప్పారావు, ఇందల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి జ్ఞాపకార్థం క్రీడాపోటీలు



విజేతలకు అందించనున్న ట్రోఫీలతో కేఎన్ఆర్, నిర్వాహకులు

పెదగంట్యాడ: తమ మిత్రుడు ప్రవీణ్‌కుమార్ జ్ఞాపకార్థం జిల్లా స్థాయి విండ్ బాల్ క్రికెట్ పోటీలను నిర్వహించడం అభినందనీయమని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. పెదనడుపూరులో నిర్వహించనున్న ఈ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి, మరణించిన ప్రవీణ్‌కుమార్ కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు కోచ్ అప్పలరాజు ఆధ్వర్యంలో స్నేహితులు, ఈ పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. టోర్నీ ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆ కుటుంబానికి అందించనున్నట్లు తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా 34 టీములు పోటీలో పాల్గొంటున్నాయని, తన వంతు సాయంగా పోటీల్లో మొదటి విజేతకు రూ.10 వేలు అందజేస్తానని తెలిపారు. విజేతలకు ఆదివారం సాయంత్రం బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో రక్షదాతలు రాజు, పవన్, బాలు తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' సంకల్పంతో కార్మికుల విజయం తథ్యం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకునేందుకు ఉక్కు సంకల్పంతో కార్మికులు చేస్తున్న ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం తలవంచక తప్పదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ పోరాటంలో కార్మికుల విజయం తథ్యమని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 835వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, కార్మికులంతా ఐక్యంగా ఉంటూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

విద్యా కానుక కిట్ల నాణ్యత పరిశీలన



చంద్రపాలెం స్టాక్ పాయింట్‌లో బూట్లు పరిశీలిస్తున్న పైడిరాజు

విశాఖ విద్య: జగనన్న విద్యా కానుక కిట్ల నాణ్యతపై శనివారం ప్రత్యేక బృందాలు తనిఖీ చేశాయి. 2023–24 విద్యా సంవత్సరం బడి తెరిచిన రోజునే విద్యార్థులందరికీ కిట్లు అందించేలా ఇప్పటికే పూర్తి స్థాయిలో వస్తువులన్నీ జిల్లాకు సరఫరా అయ్యాయి. వాటిని ఎంపిక చేసిన స్టాక్ పాయింట్లలో నిల్వ చేశారు. విద్యార్థులకు అందించే విద్యా కానుక కిట్ల లో నాణ్యతకు పెద్దపీట వేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో స్టాక్ పాయింట్లలో నిల్వ చేసిన వస్తువుల నాణ్యత తనిఖీల కోసమని డీఈవో లక్ష్మణరావు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఎంఈవోల నేతృత్వంలో ఆయా మండలాల్లో ముగ్గురు సీనియర్ హెచ్ఎంలను సభ్యులుగా ప్రత్యేక బృందాలను నియమించారు. వీరంతా స్టాక్ పాయింట్లను సందర్శించి, కిట్లను సమగ్ర పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలు స్టాక్ పాయింట్లను తనిఖీ చేశాయి. చైల్డ్ ఇన్ఫో గణాంకాల మేరకు స్టాక్ పాయింట్లకు వచ్చిన వస్తువులు, నిల్వ ఉన్న వస్తువులు, వాటి నాణ్యతలను పరిశీలించారు. ఆ నివేదిక డీఈవోకు అందజేస్తామని చినగదిలి మండల తనిఖీ బృందం సభ్యుడు పైడిరాజు తెలిపారు.